'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

సర్కారు 'మద్యే'మార్గం!

కురుల సిరులున్న అమ్మ కొప్పు ఎటువేసినా అందమే అన్నట్టు ఆదాయం పంచుకునే మార్గాలు తెలిసిన సర్కారు ఏది చేసినా కుదురుగానే ఉంటుంది. మన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి ఈ విషయంలో పెద్దగా ప్రవేశం లేదని ఆయనే పరోక్షంగా చెప్పుకోవడం/ఒప్పుకోవడం మనం చూస్తున్నాం. పైసా అప్పు పుట్టడం లేదని ఆయన ఇటీవల సెల్ఫ్ గోల్ తరహాలో ప్రకటించి రాష్ట్రం పరువు తీసిన సంగతి తెలిసిందే. ఆదాయం పెరుగదు, అప్పూ పుట్టదు, మరెలాగంటే 'మద్యేమార్గం' ఉంది కదా అని అంటున్నది సర్కారు. మందుబాబుల జేబుకు చిల్లు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నది. దీనిపై ఎక్సైజ్ శాఖ సర్క్యులర్ గాని, ఉత్తర్వులు గాని విడుదల చేయకుండానే దొంగదెబ్బ తీసినట్టు 'టీజీ లిక్కర్ ప్రైస్ యాప్'లో పెంచిన ధరలు గుట్టుచప్పుడు కాకుండా అప్‌డేట్ చేయడం సర్కారు దివాళాకోరుతనానికి అద్దం పడుతున్నది. గత ఫిబ్రవరిలోనే బీర్ల ధరలు పెంచిన సర్కారు ఇప్పుడు లిక్కర్ మీద పడ్డది. బీర్, బార్ ద్వారానే ఆదాయం పెంచుకోవాలని సర్కార్ చూస్తున్నట్టు కనిపిస్తున్నది. పైకి లేచిన తెలంగాణను విజయవంతంగా పడదోసిన సర్కారు ఈ మధ్య రైజింగ్ అనే మాటను తరచుగా ఉపయోగిస్తున్నది. ఆ రైజింగ్ ఎక్కడ ఉన్నా లేకపోయినా ఎక్సైజ్ ఆదాయంలో మాత్రం తప్పక ఉండాలని కోరుకుంటున్నట్టు కనిపిస్తున్నది.

మద్యం విధానంపై రేవంత్ ప్రభుత్వం మొదటినుంచీ గోప్యతనే పాటిస్తున్నది. ముందుగా రేట్లు పెంచబోమని ప్రకటించడం, తర్వాత లోపాయికారీగా పెంచడం ఇందుకు నిదర్శనం. మద్యం కంపెనీలతో దాగుడుమూతలు ఆడి దారికి తెచ్చుకోవడం వెనుక జరిగిన తతంగంపై ప్రజలకు అనుమానాలున్నాయి. బీఆర్ఎస్ పలు సందర్భాల్లో దీనిపై సర్కారును నిలదీసింది కూడా. ప్రజలను మరింతగా తాగుబోతులను చేసి, వారి జేబులకు చిల్లు వేసి, ఆ సొమ్ముతోనే యంత్రాంగం నడపాలని చూడటం క్షమార్హం కాదు. మొత్తంగా 420 హామీలను తుంగలో తొక్కిన సర్కారు.. మద్యం అంశాన్ని మాత్రం విడిగా చూస్తుందా? 'అధికారం చేజిక్కించుకోవడానికి నోటికొచ్చిన హామీ ఇచ్చాం.. ఇప్పుడు అవన్నీ అమలు చేయాలని అడిగితే ఎలా?' అని గడుసుగా ఎదురు ప్రశ్న వేస్తున్నారు సర్కారు పెద్దలు.

మద్యం పాలసీపై కాంగ్రెస్ గుప్పించిన హామీలు గుర్తుచేసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు. మద్యం దుకాణాలు, పబ్బులను క్రమబద్ధీకరిస్తామని, రేట్లు తగ్గిస్తామని, బెల్ట్‌షాపులను ఎత్తివేస్తామని హస్తం నేతలు అన్నారు. కానీ, ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టిన దాఖలాలు లేవు. మద్యం ప్రవాహాన్ని నియంత్రిస్తామని గొప్పగా చెప్పుకొన్నారు. ఇప్పుడేమో వందమైక్రో బ్రూవరీలకు అనుమతులిస్తూ మద్యం ఏరులై పారేందుకు గేట్లు తెరుస్తున్నారు. దారీతెన్నూ లేని పరిపాలనలో ఆదాయం రోజురోజుకూ అడుగంటుతుంటే సర్కారు కాసుల వేటలో మద్యాన్నే నమ్ముకుంటున్నది. మద్యం వల్ల ప్రజలకు హాని జరుగుతున్నట్టుగా తెగజాలి పడిపోయినోళ్లు ఇప్పుడు 'ఆ కిక్కే వేరప్పా' అన్నట్టు వ్యవహరించడం విడ్డూరం. ఏడాదికి రూ.2,500 కోట్ల ఆదాయం కోసం మందుబాబులపై అధిక ధరల భారం మోపుతున్నారు. అంతిమంగా ఇది పేద, మధ్యతరగతి కుటుంబాల దోపిడీకే దారితీస్తుందని చెప్పక తప్పదు.

రాష్ట్రపతి, గవర్నర్ చక్రవర్తులా?

టంకశాల అశోక్

అసెంబ్లీ బిల్లుల విషయమై సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాల గురించిన చర్చలు చాలా జరుగుతున్నా ప్రజాభిప్రాయం ఎట్లా ఉన్నదనే ప్రస్తావన మాత్రం ఎక్కడా రావటం లేదు. ఈ అంశంపై రాజ్యాంగం, చట్టాలు, గత వివాదాలు, తీర్పులలో విషయాలు చాలానే ఉన్నాయి. అవి అన్నీ ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి. అంతవరకు మంచిదే. అదే సమయంలో కొన్ని వివాదాలకు అసాధారణ స్వభావం ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది గమనించడం కూడా అవసరం. తమిళనాడు గవర్నర్ తీరును పురస్కరించుకొని తలెత్తిన సమస్య అటువంటిది. రాష్ట్రపతి, తదితరుల రాజ్యాంగ అధికారాలు ఏవైనా, అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో వీరెవరూ మధ్యయుగాల నాటి చక్రవర్తులు కారు. అందరి అధికారాలకు మూలం ప్రజాభిప్రాయంలో ఉంటుంది.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రజాస్వామిక వ్యవస్థలు ఏర్పడటం, రాజ్యాంగాలు, చట్టాలు రూపొందటం నిజమే. అటువంటప్పుడు, యథాతథంగా ఆలోచించినట్లయితే ప్రతి అంశంపై ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది ఆలోచించనక్కరలేదు. కొన్ని దేశాలలో వలె ప్రతి ముఖ్యమైన అంశంపై రెఫరెండం అవసరం లేదు. కానీ అదెప్పుడు? ఎన్నికైన అధికార పక్షం గాని, ప్రతిపక్షాలు గాని అటువంటి అభిప్రాయాలకు, అవి ప్రతిఫలించే రాజ్యాంగానికి, చట్టాలకు అనుగుణంగా, అక్షరబద్ధంగా, స్ఫూర్తిబద్ధంగా కూడా వ్యవహరించినప్పుడు, పాలించినప్పుడు. అప్పుడే అది ప్రజాస్వామ్యబద్ధ పాలన అవుతుంది. ప్రజలకు ఆమోదకరం అవుతుంది. అందుకు భిన్నంగా వ్యవహరించే అధికారాలు, హక్కులూ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు ఏ విధంగానైతే ఉండవో గవర్నర్లకు, రాష్ట్రపతులకు కూడా ఉండవు. ఎవరూ దైవాంశ సంభూతులు, గతకాలపు చక్రవర్తులు కారు. అందువల్ల, గవర్నర్లను, రాష్ట్రపతినే సుప్రీంకోర్టు ఆదేశిస్తుందా? అనే ప్రశ్న ఎంత మాత్రం అవగాహన లేని, విలువ లేని దురహంకార పూరితమైన వైఖరి మాత్రమే.

ఇది చూసినప్పుడు అమెరికాలో జరుగుతున్నది గుర్తుకు వస్తున్నది. భారతదేశాన్ని ప్రపంచం లోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ అంటారు. నిజమా కాదా అన్నది అట్లుంచి, ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని ప్రధాని మోదీ సగర్వంగా చాటిచెప్తుంటారు. అమెరికాను గొప్ప ప్రజాస్వామ్యమంటారు. ప్రస్తుతం ఈ రెండు ఘనమైన ప్రజాస్వామ్యాల్లో జరుగుతున్నది ఒకే విధంగా ఉండటం విశేషం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్రమ వలసదారులని చెప్పేవారి నుంచి మొదలుకొని, స్వయంగా తమ పౌరులు అయినవారిపై, పరిపాలనా వ్యవస్థపై తీసుకుంటున్న పలు చర్యలపై కోర్టులు స్టే విధిస్తున్నాయి. కొన్నింటిని కొట్టివేస్తున్నాయి. ఆయా కోర్టు ఉత్తర్వులను ట్రంప్ ప్రభుత్వం పాటించడానికి బదులు బహిరంగంగా ధిక్కరిస్తున్నది. ఆ జడ్జీలను ప్రభుత్వంతో పాటు, ట్రంప్ అధికారులు, అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీ నాయకులు బాహాటంగా పదే పదే విమర్శిస్తున్నారు. వారిని ఇంపీచ్‌మెంట్‌తో పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకరినైతే, నమ్మశక్యం కాని రీతిలో, ఏదో సాకు చూపి అరెస్టు చేసే దాకా వెళ్లారు.



> ఒక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఇట్లా జరుగుతుండగా, మరొక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఏమి జరుగుతున్నది? గత చరిత్రను పక్కన ఉంచుదాం. తమిళనాడు బిల్లుల సంగతి చూద్దాం. అక్కడి అసెంబ్లీ ఒకటికి రెండుసార్లు రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆమోదించిన బిల్లులను కూడా అక్కడి గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచుతారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత సైతం నిబంధనలకు విరుద్ధంగా అప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపుతారు.

బిల్లుల పట్ల ఆ విధమైన వైఖరి వల్ల రాష్ట్రంలో వేర్వేరు శాఖల పరిపాలన దెబ్బతింటుంది. అయినప్పటికీ ఆయన లెక్కచేయరు. ఇదే ఒక అప్రజాస్వామికమైన, రాజ్యాంగ విరుద్ధమైన దారుణ ప్రవర్తన కాగా, అంతకన్న దారుణమైనది మరొక స్థాయిలో జరుగుతుంటుంది. అది ఢిల్లీ స్థాయిలో. అక్కడి నుంచి అన్నీ గమనించే హోంశాఖ, హోంమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఎవరూ అది తగదని వారించరు. పరిస్థితిని సరిదిద్దరు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులు చేసినా పట్టించుకోరు. గవర్నర్ రవి ఇది చాలదన్నట్లు, తన అధికార పరిధులను బాహాటంగా అతిక్రమిస్తూ, అక్కడి అధికారపక్షమైన డీఎంకేకు వ్యతిరేకంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తుంటారు. అటువంటి కార్యకలాపాలలో పాల్గొంటారు.

గవర్నర్ రవికి ఒక ప్రతిష్ఠాత్మకమైన నేపథ్యం ఉంది. ఐపీఎస్ అధికారి అయిన ఆయన అందుకు సంబంధించిన పలు హోదాలలో పని చేసిన తర్వాత, కొన్ని చోట్ల గవర్నర్‌గా కూడా ఉండిన వెనుక, నాగాలాండ్‌కు గవర్నర్‌గా నియమితులయ్యారు. సమస్యాత్మక ఈశాన్య భారత రాష్ట్రాలలో ఐపీఎస్ నుంచి, సైన్యం నుంచి రిటైరైన వారిని గవర్నర్లుగా నియమించటం ఎప్పటి నుంచో ఉంది. అంతవరకు సరే. కానీ, వాటన్నింటిలో అతి క్లిష్టమైన, అతి సున్నితమైన నాగాలాండ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. పైగా అప్పుడు నాగా సంస్థలకు, కేంద్రానికి మధ్య చర్చలు జరుగుతున్నాయి. అంతకుముందు అక్కడ పనిచేసిన వారిలో జనరల్ కె.వి.కృష్ణారావు ఉన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన కె.పద్మనాభయ్య నాగాలతో చాలాసార్లు చర్చలు జరిపారు. అప్పుడంతా వారు ఎంతో నేర్పుగా వ్యవహరించారు. కానీ, రవి తీరుతో విసుగెత్తిన నాగాలు ఆయనను తొలగిస్తే తప్ప చర్చలు జరుపబోమని ప్రకటించటంతో కేంద్రం తనను తమిళనాడుకు బదిలీ చేసింది. రాజకీయంగా ఆ రాష్ట్రం మరొక విధంగా సున్నితమైనది. కానీ, ఆయన తీరు మారలేదు. విషయం చిలికిచిలికి ప్రస్తుతం మనం చూస్తున్నట్లు గాలివానగా మారింది.

అసలు సమస్య కేంద్రం వద్ద ఉంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నచోట వాటిని రకరకాల ఇబ్బందులకు గురిచేయటం, వీలైతే పడగొట్టడం, అందుకు గవర్నర్లను ఉపయోగించుకోవటం. వాస్తవానికి ఈ అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన ధోరణిని ఆరంభించింది కాంగ్రెస్ పార్టీ. ఆ దుష్ట సంప్రదాయాన్ని బీజేపీ కూడా కొనసాగిస్తున్నది. అప్పుడు కాంగ్రెస్‌కు నీతులు చెప్పి తాని ప్పుడు అదే పనిచేస్తున్నది. తమిళనాడు పొరుగున గల కేరళలో ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ఇటు తెలంగాణలో తమిళిసై, అటు పశ్చిమబెంగాల్‌లో ఆనందబోస్‌ల చర్యలు తెలిసినవే.

> ఇప్పుడు గవర్నర్ రవిని కేంద్రం ఇన్నిన్ని జరుగుతున్నా అదుపు చేయకపోగా, తమకు కొరకరాని కొయ్యగా మారిన డీఎంకేను ఆయన చికాకు పరచటాన్ని చూసి ఆనందిస్తున్నదనాలి. గవర్నర్ పదవి రాజ్యాంగపరమైనది అయినప్పుడు, రాజ్యాంగానికి అధినాయకత్వ స్థానంలో గల రాష్ట్రపతి ఏమి చేస్తున్నట్లు? పైకి కన్పించింది అయితే ఏమీలేదు. తను ఏమైనా చేసినా మనకు కన్పించలేదో లేక రబ్బర్ స్టాంప్ వలె వ్యవహరించారో తెలియదు.

ఇంతకూ ఏప్రిల్ 8వ తేదీ నాటి తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందేమిటి? ప్రజలు రాజ్యాంగం ప్రకారం ఎన్నుకున్న చట్టసభలు నిబంధనల మేరకు ఆమోదించిన బిల్లులకు తమ స్థాయిలో ఆమోదం తెలుపటంలో గవర్నర్లు గాని, రాష్ట్రపతి గాని అసమంజసమైన జాప్యం చేయరాదని. నిబంధనలకు లోబడి పరిశీలించటం, పున:పరిశీలన కోసం అసెంబ్లీకి తిప్పి పంపటం వంటివి సరే. కానీ, అవే నిబంధనలకు అనుగుణంగా అసెంబ్లీ తాను చేయవలసిందంతా చేసిన తర్వాత ఏదో ఒకటి తేల్చటంలో విపరీత జాప్యాలు ఎందుకు? అసెంబ్లీ రెండవసారి ఆమోదించినాక ఇక ఆపేందుకు వీల్లేదన్న నిబంధనను పాటించకపోవటమెందుకు? అట్లా జరిగినప్పుడు, అందులో రాజ్యాంగంతో నిమిత్తం లేని రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అనుమానం సహజంగా కలుగుతుంది. న్యాయమూర్తులు చేసింది, ఒకవైపు రాజ్యాంగ నిబంధనలకూ, స్ఫూర్తికి, మరొకవైపు ప్రజాస్వామిక పాలనకు అనుగుణంగా ఉండేట్లు, బిల్లుల ఆమోదానికి మూడు నెలల గడువు విధించటం మాత్రమే. గవర్నర్లకు, రాష్ట్రపతికి కూడా. మూడు నెలలకు మించితే ఆ బిల్లులు ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లేనని కోర్టు స్పష్టం చేసింది. అందులో ఆక్షేపించవలసిందేమీ కన్పించదు. పైగా స్వయంగా కేంద్రమే ఇటువంటి గడువుతో 2016లో మూడు మెమోలు జారీచేసినట్లు కోర్టు గుర్తుచేసింది. నిజానికి రాష్ట్రపతి లేఖను అవకాశంగా తీసుకుని గవర్నర్లు, రాష్ట్రపతితో పాటు స్పీకర్ల అధికారాలు, పరిమితులను కూడా న్యాయమూర్తులు నిర్వచించినట్లయితే ప్రజాస్వామ్యానికి చాలా మేలు జరుగుతుంది. ఇంత జరిగి, ఇంత స్పష్టత వచ్చిన తర్వాతనైనా కేంద్రప్రభుత్వం, అధికార పార్టీ వారు తమ తప్పిదాన్ని గుర్తించి వైఖరిని మార్చుకోలేదు. రాష్ట్రపతి ద్వారా రకరకాల సాంకేతిక ప్రశ్నలతో సుప్రీంకోర్టుకు లేఖ రాయించారు. అందువల్ల కోర్టు మౌలిక ఉత్తర్వుల పరిస్థితి మారేది ఏమీ ఉండదని, న్యాయనిపుణులు గతంలోనూ తలెత్తిన ఇదే విధమైన కేసులను ఉదహరిస్తూ స్పష్టం చేస్తున్నారు. గవర్నర్ రవికి సుప్రీంకోర్టు ఇదే బిల్లుల విషయంలో ఆదేశాలు జారీచేయగా, ఆయన కొన్ని ఆమోదించి, కొన్ని చేయక తన చమత్కారాన్ని ప్రదర్శించారు. దానిపై కోర్టు ఆగ్రహించి ఈ తాజా తీర్పు చెప్పింది. అయినప్పటికీ గ్రహించక రాష్ట్రపతికే ఆదేశాలిస్తారా? అంటూ తమ అధికార దురహంకారాన్ని బీజేపీ నేతలు ప్రదర్శిస్తున్నారు.

ఈ మొత్తం సంఘటనల పరంపరపై బయట ఈ దేశ ప్రజల అభిప్రాయాలు ఏ విధంగా ఉన్నాయో గమనించాలనే ఆలోచన ఎవరికైనా కలుగుతున్నదా? రాజ్యాంగ పీఠిక మొదటి వాక్యమే 'ఈ దేశప్రజలమైన మేము' అంటూ ఆరంభమవుతుంది. కానీ గవర్నర్లు, బిల్లులు, రాష్ట్రపతుల విషయానికి సంబంధించి, ప్రతిపక్ష ప్రభుత్వాల పట్ల కాంగ్రెస్, బీజేపీల బాహాటమైన రాజ్యాంగవిరుద్ధ, ప్రజాస్వామ్య విరుద్ధ, ప్రజాభావనల విరుద్ధ వ్యవహరణలు, భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకొనేందుకే సిగ్గు కలిగించే విధంగా ఉన్నాయి. ఎప్పుడైనా పెద్దదా, చిన్నదా అనే పరిమాణాల కన్నా ఎంతటి ప్రమాణాలు కలదన్నదే లెక్కించదగ్గది కావాలి. ఆ విధంగా చూసినప్పుడు ఈ పార్టీలు మన ప్రజాస్వామ్యాన్ని, ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా, తమ అధికారం కోసం భ్రష్టుపట్టిస్తున్నాయి. ■

దేశం కాని దేశంలో.. ఆదుకునే రామన్న

పొట్టకూటి కోసం గల్ఫ్, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లిన చాలామంది తెలంగాణ బిడ్డలు దళారుల చేతుల్లో మోసపోయి దేశం కాని దేశంలో చిక్కుకుపోతున్నారు. దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్న అలాంటివారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అండగా నిలుస్తూ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు.

సౌదీ, యూఏఈ, కువైట్, ఒమన్, మయన్మార్, థాయిలాండ్, సింగపూర్ దేశాలకు వేలమంది తెలంగాణ బిడ్డలు శ్రామికులుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో కొందరు దళారులు తాత్కాలిక వర్క్ పర్మిట్ వీసాలతో విదేశాలకు తీసుకెళ్లి మోసం చేస్తున్నారు. నెలలు గడవకముందే వీసా కాలపరిమితి ముగిసిందని అక్కడి సంస్థలు ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నాయి. దీంతో అక్రమ చొరబాటుదారులుగా ముద్ర వేసి ఆయా ప్రభుత్వాలు నిర్బంధిస్తున్నాయి. ఇలా దేశం కాని దేశంలో చెరసాలలో మగ్గుతున్న చాలామంది.. కేటీఆర్ విశేష కృషి మూలంగానే మళ్లీ తెలంగాణ మట్టి వాసన పీలుస్తున్నారు.

2017లో 20 మంది తెలంగాణ కార్మికులను కువైట్ పోలీసులు అరెస్టు చేయగా.. అప్పటి మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ ఎన్నారై శాఖ ద్వారా అవసరమైన పత్రాలు మంజూరు చేయించి వారిని స్వదేశానికి తీసుకొచ్చారు. 2019లో నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన 40 మంది కార్మికులు ఇలాగే చిక్కుకోగా.. భారత ఎంబసీ అధికారులతో మాట్లాడి స్వదేశానికి తీసుకొచ్చారు. గల్ఫ్‌లోని కార్మికుల కోసం అప్పటి కేంద్ర మంత్రి వీకే సింగ్‌తో మాట్లాడి 2017 మే 12న 'విదేశీ సంపర్క సదస్సు'ను కేటీఆర్ నిర్వహించారు.

నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తెలంగాణ కార్మికులకు కేటీఆర్ సాయమందిస్తూనే ఉన్నారు. బహ్రెయిన్‌లో ఏండ్లుగా జైలు జీవితం గడుపుతున్న సిరిసిల్ల జిల్లా చీర్ల వంచకు చెందిన నరసయ్యను స్వరాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేశారు. మలేషియాలో నిర్బంధంలో ఉన్న ఖానాపూర్‌కు చెందిన ఆరుగురు కార్మికులను విడిపించారు.ఖానాపూర్‌లో ఇద్దరు గిరిజన బాలికలు రోడ్డు ప్రమాదంలో మరణించగా, మలేషియాలో ఉన్న వాళ్ల తండ్రిని సొంత ఖర్చులతో స్వదేశానికి తీసుకొచ్చారు.

తెలంగాణ బిడ్డలకే కాదు, ఇతర ప్రాంతాల వారికీ కేటీఆర్ బాసటగా నిలుస్తున్నారు. న్యూజిలాండ్‌లో స్థిరపడిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కరోనా సమయంలో తన తల్లి వైద్య సదుపాయానికి సహకరించాలని కేటీఆర్‌ను ట్విటర్‌లో కోరారు. తక్షణమే స్పందించిన కేటీఆర్.. నిమ్స్‌లో చికిత్సకు ఏర్పాట్లు చేయించారు. తెలంగాణ బిడ్డలతో పాటు ఇతరులకు కూడా అండగా నిలబడుతున్న గొప్ప మానవతావాది మన కల్వకుంట్ల తారకరాముడు.

శ్రీను నాయక్ దోన్‌వాన్
85220 18001

(వ్యాసకర్త: బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి, ఓయూ)

ఉద్యోగులపై ప్రేమ ఉత్తిదేనా?

డా. అయాచితం శ్రీధర్
98498 93238

వెనకటికి ఓ ప్రబుద్ధుడు.. పంచ పాండవులు ఎందరంటే మంచం కోళ్ల వలె ముగ్గురు అని చెప్పి, రెండు వేళ్లు చూపించి, ఒకటి అంకె రాశాడట. ప్రస్తుత తెలంగాణ పాలకులు అదే చేస్తున్నారు. ఎన్నికలకు ముందు చెప్పింది కొండంత. గెలిచి గద్దెనెక్కాక చేస్తున్నది గోరంత. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అడుగడుగునా ఎదురవుతున్నవి వంచనలు, వక్ర భాష్యాలే.

ఇచ్చిన హామీలకు వరుసగా ఎగనామాలు పెట్టుకుంటూ ఇదేమిటని అడిగితే దగాకోరు మాటలకు, దబాయింపులకు పాల్పడుతున్న పాలకులు ఇప్పుడు ఏకంగా ఉద్యోగులపై, పెన్షనర్లపై విరుచుకుపడుతున్నారు. వారంతా తెలంగాణ సాధనోద్యమంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని తెగించి పోరాడిన వీరసైనికులన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. ప్రజలకు ఉద్యోగులకు మధ్య విభేదాలు సృష్టించే కపట నాటకానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఓ సమావేశంలో ప్రసంగిస్తూ ఉద్యోగులకు, పెన్షనర్లకు న్యాయంగా చెల్లించాల్సిన భత్యాలు, బకాయిల విషయంలో చేతులెత్తేశారు. పైగా 'రాష్ట్ర ఆదాయం ఇంత. అవుతున్న ఖర్చు ఇంత. నన్నేం చేయమంటారు, నన్ను కోసుకొని తింటరా?' అని ప్రశ్నించారు. ఈ మెట్ట వేదాంతం వినడానికేనా ప్రజలు ఎన్నుకున్నది. గంగ దాటే దాకా ఓడ మల్లన్న గట్టు పైకెక్కాక బోడి మల్లన్న అన్నట్లు ఎన్నికలకు ముందు ఉద్యోగులను, పెన్షనర్లను కల్లబొల్లి వాగ్దానాలతో బులిపించిన నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా మాట్లాడటం ఆశ్చర్యం కలిగించింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా కమిటీల మీద కమిటీలు వేస్తూ ఏమీ తేల్చకుండా కాలయాపన చేస్తున్నా సహనంతో తమ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సామరస్య వాతావరణంలో తమకు న్యాయంగా రావాల్సిన వాటిని చెల్లించాలని అభ్యర్థించడమే ప్రభుత్వం దృష్టిలో మహాపరాధమా? అది ప్రజలపై యుద్ధమా? ఇదెక్కడి న్యాయం?

'జీతాలు పెంచాలంటే, పెన్షన్లు బకాయిలు చెల్లించాలంటే.. ఉప్పు, పప్పు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాల్నా? లేక రైతుభరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, సామాజిక పెన్షన్లు తగ్గించాల్నా?' అంటూ ఉద్యోగులను సీఎం ప్రశ్నించారు. ఇవి అసమంజసమైన, అత్యంత ప్రమాదకరమైన ప్రశ్నలు. ఉద్యోగులు, పెన్షనర్లకు.. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు, ప్రజలకు మధ్య అగాధం సృష్టించే ఎత్తుగడలు. ఎన్నికలకు ముందు ఇవే షరతులను ముందుంచి ఉద్యోగులను, పెన్షనర్లను ఓట్లు అడిగి ఉంటే ఇప్పుడు ప్రభుత్వానికి అలా ప్రశ్నించే నైతిక హక్కు ఉండేది.

ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగమేనని.. ఉద్యోగులు, ప్రభుత్వం వేర్వేరు కాదని ముఖ్యమంత్రి అన్నారు. నిజమే. ప్రభుత్వాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులు ఒక మెట్టు దిగిన సందర్భాలు, కొంత అటూఇటూ అయినా సర్దుకుపోయిన సందర్భాలెన్నో. ప్రభుత్వం తమ దేనని ఉద్యోగులు అనుకున్నారు కాబట్టే అది సాధ్యమైంది. అలాగని తమ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి, హక్కులకు భంగం కలుగుతుంటే ఉద్యోగులు చేతులు ముడుచుకుని కూర్చోరని చరిత్ర చెప్తున్నది.

వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన పాలకులు బీదరుపులతో బాధ్యతల నుంచి తప్పించుకోలేరు. గత ప్రభుత్వం మీద ఆడిపోసుకోవడం ఇంకెంత కాలం? అందాలంటూ, విందులంటూ పనికి మాలిన కార్యక్రమాలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. ఉద్యోగులు, పెన్షనర్ల దగ్గరకు వచ్చేసరికి ఖాళీ జోలె చూపించడం నయవంచనే. సమైక్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు కూడా కరువు భత్యం ఎగ్గొట్టడానికి, ఉద్యోగులపై ప్రజలను రెచ్చగొట్టడానికి విఫలయత్నం చేశారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆయన ఆలోచనా విధానంతోనే కొనసాగుతున్నట్టు అనిపిస్తున్నది.

> కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు వేల కోట్ల రూపాయల సంక్షేమ పథకాలు అమలయ్యాయి. వాటిని బూచిగా చూపి నాటి ప్రభుత్వం జీతభత్యాలకు గండి కొట్ట లేదు. పరిపాలించలేని చేతగానితనం, పలు చబడిపోతున్న పరపతి వల్ల పుట్టుకొస్తున్న ఉక్రోషాన్ని ఉద్యోగులపై, పెన్షనర్లపై వెళ్లగక్కడం ముమ్మాటికీ వైఫల్యమే.

ముందుచూపు, ప్రాధాన్యాల ఎంపిక, పాలనా నైపుణ్యం ఉంటే ఉద్యోగులు, పెన్షనర్లకు మొత్తంగా లేదా కనీసం వాయిదాల ప్రకారం చెల్లింపులు జరపడం కష్టమేమీ కాదు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 43 శాతం ఫిట్‌మెంట్, రిటైర్‌మెంట్ వయో పరిమితి పెంపు, ఇంక్రిమెంట్ ఇచ్చి ప్రభుత్వరంగ సంస్థలకు పరిపుష్టి కల్పించిన పూర్వ ముఖ్యమంత్రి కేసీఆర్.. రెండేండ్ల పాటు కరోనా సంక్షోభంలోనూ యథావిధిగా జీతభత్యాలు చెల్లించారు. కరోనా అనంతర కాలంలో వేతనాలు, పెన్షన్లు చెల్లించేందుకు వారం, పది రోజుల పాటు ఆలస్యమైతేనే గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఏకంగా ఎగనామం పెట్టే పనిలో ఉన్నట్టు అనుమానం కలుగుతున్నది. అందుకు ధరల పెంపు, పథకాల కుదింపు బెదిరింపులను ముందుంచి వాటి వెనకనక్కి దాక్కోవాలని ప్రయత్నిస్తున్నది. రక్షించాల్సిన కంచే చేను మేయాలని చూస్తున్నది.

(వ్యాసకర్త: విశ్రాంత ప్రభుత్వ అధ్యాపకులు)



గాజాపై నియంత్రణ సాధిస్తాం

అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిళ్ల కారణంగా గాజాకు ఆహార సరఫరాపై ఆంక్షలను ఎత్తివేశాం. తక్కువ మొత్తంలో ఆహారాన్ని మాత్రమే అనుమతిస్తాం. మా పోరాటంలో పురోగతి సాధిస్తున్నాం. గాజా భూభాగాన్ని మేం పూర్తిగా నియంత్రణలోకి తీసుకుంటాం. మా సైన్యం యుద్ధ భూ భాగంలో కొత్తగా సాగిస్తున్న దాడులతో ఇది సాధ్యపడుతుంది.

- బెంజమిన్ నెతన్యాహు, ఇజ్రాయెల్ ప్రధాని

రెనెగేడ్ అనసూయ

అబలయని దేశమును కబళించ తలపడిన
పరరాజులకు స్త్రీల పటు శౌర్యమును చూపి
రాజతంత్రము నడిపెరా తెలంగాణ రాణి రుద్రమదేవిరా!

కుట్రలను, కుతంత్రాలను చీల్చి చెండాడుతూ రా